క్లుప్తంగా

నేడు చేయూత మహిళా మార్ట్ ప్రారంభం

పెడన: వెలుగు ఆధ్వర్యంలో పెడన పట్టణంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్ట్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ సోమవారం ఉదయం ప్రారంభిస్తారని వెలుగు ఏపీఎం శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా మహిళలు ఏర్పాటు చేసిన ఈ మహిళా మార్ట్‌లో అన్నిరకాల సరుకులు, వస్తువులు విక్రయిస్తారని చెప్పారు. మహిళా మార్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి జోగి రమేష్‌తో పాటు ఎంపీ బాలశౌరి, జిల్లా కలెక్టర్ రాజాబాబు తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలో నూతనంగా నిర్మించిన తాగునీటి ఆర్వో ప్లాంట్‌ను స్థానిక సర్పంచ్ బండ్రెడ్డి శివపార్వతి ఆదివారం ప్రారంభించారు. ఈ పథకం కోసం గ్రామస్తులైన దివంగత రేమాల అంజయ్య, నారాయణమ్మ జ్ఞాపకార్థం అమెరికాలో నివశిస్తున్న వారి కుమారుడు రేమాల వెంకటేశ్వరరావు, సత్యకుమారి దంపతులు రూ.14 లక్షలు వితరణ చేశారు. ఈ సందర్భంగా దాత బంధువులు, సర్పంచ్‌ను గ్రామస్తులు సన్మానించారు.

అమ్మవారికి 108 చీరలతో అలంకరణ



టేకుపల్లి(మోపిదేవి): మండల పరిధి టేకుపల్లిలోని బాల పార్వతి సమేత రామేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఆదివారం పార్వతి అమ్మవారిని 108 చీరలతో అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నూతన వస్త్రాలు (చీరల)తో అలంకరించారు. శ్రావణమాసం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశామని ఆలయ కమిటీ తెలిపింది. పలు గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారు, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నవగ్రహ మండప నిర్మాణానికి భూమి పూజ



గూడూరు: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో నవగ్రహ మండప నిర్మాణానికి ఎంపీపీ సంగా మధుసూదనరావు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ చొరవతో నవగ్రహ మండప నిర్మాణం, ఆలయం మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో వేద పండితుల మంత్రాల నడుమ ఎంపీపీ మధుసూదనరావు, రైల్వే బోర్డు మెంబరు మోటేపల్లి రత్నారావు దంపతులచే మండపం నిర్మాణానికి శాస్త్రోక్తకంగా భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో గూడూరు పీఏసీఎస్ డైరెక్టర్ ఆకూరి శ్రీనివాసరావు, ఆలయ మేనేజర్ టీవీవీ మోహనరావు, పి. అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొండలమ్మకు మొక్కుబడుల చెల్లింపు

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులను చెల్లించుకునేందుకు ఆలయంలో ఆదివారం క్యూలైనుల్లో భక్తులు అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి తగు ఏర్పాట్లు చేశారు.

నేటి నుంచి కార్యదర్శులకు శిక్షణ

విజయవాడరూరల్: జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో రూరల్ మండలంలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు మూడవ బ్యాచ్‌కు సోమవారం నుంచి 16వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బీఎల్‌వీ శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. నున్న సచివాలయం 2,3 గ్రేడు 5 కార్యదర్శులు, పి.నైనవరం, పైడూరుపాడు, పాతపాడు, ప్రసాదంపాడు 2,3, రామవరప్పాడు 2,3, 5, రాయనపాడు గ్రామాల గ్రేడు 5 కార్యదర్శులకు శిక్షణ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. గత రెండు బ్యాచ్‌లకు జరిగిన ట్రైనింగ్ క్లాసులకు హాజరుకాలేని వారు ఈ దఫా జరిగే శిక్షణకు రావచ్చన్నారు. గుణదలలోని సోషల్ సర్వీసు సెంటర్లో 6 రోజుల పాటు జరిగే ట్రైనింగ్ క్లాసులు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుంచే ప్రారంభమవుతాయన్నారు.

గృహయోగం



కరగ్రహారం పంచాయతీ క్యాంపుబెల్‌పేటలో జగనన్న కాలనీ



బందరు మండలం తాళ్లపాలెంలో జగనన్న కాలనీ

- నెరవేరనున్న సొంతింటి కల
- చురుగ్గా గృహ నిర్మాణాలు
- మండలంలో 63 లే అవుట్లు
- గృహ నిర్మాణాల లక్ష్యం 5,594
- పూర్తయిన గృహాల సంఖ్య 1,287
- వివిధ దశల్లో ఉన్నవి 4,307 ఇళ్లు

కోనేరుసెంటర్: మండలంలో నిరుపేదల సొంతింటి కల సాకారమవుతోంది. నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకం కింద మండలంలో గృహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. మండలంలో 5,594 ఇళ్లు నిర్మించాలన్నది లక్ష్యం కాగా వాటిలో 1,287 ఇళ్లు పూర్తయ్యాయి. మిగిలినవి గ్రౌండింగ్ పనులు పూర్తి చేసుకుని వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయి.

వేగంగా నిర్మాణ పనులు..

మండలంలో గృహ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. స్థలాల కేటాయింపు మొదలుకుని నిర్మాణాల వరకు ప్రతిపక్ష నాయకులు అనేక అడ్డంకులు సృష్టించారు. అయినప్పటికీ బందరు ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) వీటిన్నింటినీ అధిగమించి లేఅవుట్లకు సంబంధించిన భూములను ఆయా గ్రామాల రైతులతో చర్చించి ధర విషయంలో రైతులందరినీ ఏకతాటిపైకి తెచ్చి పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వంతో అనేకమార్లు చర్చలు జరిపి సఫలీకృతులయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం పేదల సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో అడుగులు ముందుకు వేశారు. గృహ నిర్మాణాలకు సంబంధించి ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులతో కాన్ఫరెన్సుల ద్వారా మాట్లాడుతూ స్వయంగా పర్యవేక్షించారు. ఏ ఒక్క పేదవాడు సొంత గూడు లేదనే బాధ లేకుండా ఉండేందుకు జగనన్న లేఅవుట్‌లను ఏర్పాటుచేసి ఊరులకు ఊరులు నిర్మించి ప్రతిపక్షాలను ముక్కున వేలేసుకునేలా చేశారు.

మండలంలో 1,287 గృహ నిర్మాణాలు పూర్తి

మండలంలో 5,594 ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా ఇప్పటి వరకు దాదాపు 1,287 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. సదరు గృహ నిర్మాణాలకు సంబంధించి గృహ నిర్మాణ శాఖ ద్వారా మండలానికి రూ. 30.90 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులతో 1,287 ఇళ్లు పక్కా గృహాలుగా రూపాంతరం చెందగా మిగిలిన ఇళ్లు వివిధ దశల్లో పనులు జరుపుకుంటున్నాయి. వీటిలో చాలా వరకు నిర్మాణాలు పూర్తి చేసుకునే దశలో ఉండగా మరి కొన్ని గ్రౌండింగ్ దశలో పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పుణ్యమా అని పేద అక్కచెల్లెమ్మలకు సొంతింటి కల నెరవేరుతుండగా వారి కుటుంబాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. కూలి పనులకు వెళుతూ వందలాది పేద కుటుంబాలు కాలనీల్లో జరిగే నిర్మాణ పనులకు వెళుతుండటంతో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి.

పట్టువీడని పేర్ని

మండలంలోని పేదలందరికీ వారి వారి గ్రామాల్లో సొంత ఇళ్లు కట్టించి ఇవ్వాలనే సంకల్పంతో బందరు ఎమ్మెల్యే పేర్ని నాని రంగంలోకి దిగి కొన్ని వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించారు. ఒక్క కరగ్రహారంలోనే అతి పెద్ద లేఅవుట్ వేయించి అందులో దాదాపు 16,000 మందికి పట్టాలు అందజేయడంతో పాటు గృహ నిర్మాణ శాఖ ద్వారా పక్కా గృహాలు నిర్మించుకునేందుకు తన వంతు కృషి చేశారు. అలా మారుమూల గ్రామమైన కరగ్రహారాన్ని మరి కొన్ని రోజుల్లో మండలంలోనే అతి పెద్ద ఊరుగా జగనన్న కాలనీని తీర్చిదిద్దేందుకు విశేష కృషి చేస్తున్నారు. జగనన్న కాలనీల్లో పేదలందరూ ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం నుంచి సహాయం అందేలా గత, ప్రస్తుత జిల్లా కలెక్టర్‌లతో నిరంతరం చర్చిస్తూ పనులు వేగంగా జరిగేలా పేర్ని నాని తనవంతు కృషి చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు పేర్ని నాని చొరవతో నేడు మండలంలో అనేక గ్రామాలు కొత్త ఊరులుగా రూపాంతరం చెందుతుండటంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



సొంతంగా ఇల్లు కట్టుకుంటానని కలలో కూడా అనుకోలేదు. ఆ కల నెరవేరింది. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే కారణం. ఆయన స్థలాలు ఇచ్చి రుణాలు అందించకపోతే సొంతింటి కల కలగానే మిగిలిపోయేది. సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– నంగిగడ్డ రంగశ్రీ, పోతేపల్లి, బందరు మండలం

ఎన్నో ఏళ్ల నాటి కల



సొంత ఇల్లు కట్టుకోవాలన్నది ఎన్నో ఏళ్ల కల. పుట్టింటి వారు పసుపు, కుంకుమ ఇచ్చినట్లు ఆడపడుచులకు అన్నలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇళ్లు కట్టుకునే అదృష్టాన్ని కలిగించారు. ఇంతకంటే మాకు ఏం కావాలి. వచ్చే ఎన్నికలలోనూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి అవుతాడు.

– కందికుప్ప మల్లేశ్వరి, మేకవానిపాలెం, బందరు మండలం

ప్రభు కుమారికి సన్మానం

నాగాయలంక: దక్షిణ కొరియాకు చెందిన ఛాంగ్ హూంగ్ హోంగ్ చర్చి డయాసిస్ యూనివర్సిటీ డాక్టర్ ఆఫ్ డివైనిటీ పట్టా పొందిన స్థానిక షెకీనా మినిస్ట్రీస్ నిర్వాహకురాలు పూషడపు ప్రభుకుమారిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల కృత్తివెన్ను మండలం నిడమర్రులోని యూనివర్సిటీ చర్చి డయాసిస్ సంస్థలో బిషప్ రాజాబాబు చేతుల మీదుగా యూనివర్సిటీ అధికారిక డాక్టరేట్ పట్టాను ఆమె అందుకున్నారు. డాక్టరేట్ పురస్కారం నేపథ్యంలో సంస్థ ప్రాంగణంలో ఆదివారం మినిస్ట్రీస్ సభ్యులు, మండలంలోని దైవజనుల ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రభుకుమారిని ఘనంగా సత్కరించిన సంఘస్తులు ఆమెకు లక్షన్నర రూపాయలు కానుకగా బహుకరించారు. చర్చి సంఘ పెద్దలు గుడివాక జీవన్‌రాజు, సింహాద్రి రోజారాణి పర్యవేక్షించారు. కార్యక్రమంలో దైవజనులు, సేవకులు పాల్గొని ఆమె అందిస్తున్న దైవత్వ సేవలను కొనియాడారు.



ప్రభుకుమారిని సన్మానించిన రోజారాణి, జీవన్‌రాజు, సంఘస్తులు

ఘనంగా గంగానమ్మ జాతర



గంగానమ్మ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు



గంగానమ్మ జాతర ముగింపు కార్యక్రమంలో దూలం శ్యామ్ ఫణికుమార్

పామర్రు: గంగానమ్మ పోతురాజుల జాతర గ్రామోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బందరు రోడ్డులోని లాకు బజారులో ఉన్న గంగానమ్మ తల్లి, పోతురాజు గడలతో స్థానికులు భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం వైభవంగా చేశారు. డప్పువాయిద్యాలతో, మేళ తాళాలతో గ్రామంలోని వీధుల వెంబడి అమ్మవారిని ఊరేగించారు. చిన్నారులు, పెద్దలు చిందులు వేస్తూ ఎంతో ఉత్సాహంగా, ఉల్లాసంగా జాతర మహోత్సవంలో పాల్గొన్నారు. ఊరేగింపులో ప్రజలు అమ్మవారికి చద్ది నివేదనలు, హారతులు ఇచ్చారు. ఆలయంలో భక్తులు అమ్మవారికి వేడి నివేదనలను సమర్పించి, మొక్కుబడులను తీర్చుకున్నారు. రజక సంఘ పెద్దలు, నాయకులు, యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పమిడిముక్కల: స్థానిక గంగానమ్మ తల్లి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గంగానమ్మ జాతర మహోత్సవాలు వైభవంగా జరిపారు.

కై కలూరు: స్థానిక బైపాస్ రోడ్డులో ఈ నెల 6న ప్రారంభమైన గంగానమ్మ జాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అమ్మవారికి నైవేద్యాలు సమర్పణ, గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం నుంచి గుడి వద్ద డప్పులు, మేళతాళాలు, తీన్‌మార్‌తో సందడి వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కుమారుడు శ్యామ్ ఫణికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని పూజలు చేశారు. నిర్వాహకులు తులసి పూర్ణ, నిమ్మల సాయి, నరసింహారావు, సుబ్బారావు, ఫణి, చిన్నా, శ్యామ్, మణి పాల్గొన్నారు.

బాల వికాస్ కేంద్రం ప్రారంభం

పామర్రు: ప్రతి ఒక్కరికీ లౌకికమైన విద్య, మానవత విలువలు పెంపొందించటమే బాల వికాస్ కేంద్రాల ముఖ్య లక్షణమని కృష్ణా జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్ రావు అన్నారు. స్థానిక కోటిరెడ్డి పేటలో కోటి నాగ మహేశ్వరరావు, దుర్గా నాంచారమ్మ దంపతుల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల వికాస్ కేంద్రాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. తొలుత పుట్టపర్తి సాయిబాబాకు విశేషంగా పూజలు నిర్వహించారు. చిన్నారులు నిర్వహించిన కోలాట ప్రదర్శనలు అలరించాయి. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రావు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన 'నమామి శత రుద్రీయం' కార్యక్రమం స్థానిక ప్రగతి కళా శాలలో ఉదయం 5 గంటలకు 2 వేల మందితో నగర సంకీర్తనతో ప్రారంభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 108 శివలింగాలకు సామూహికంగా అభిషేకం చేసుకునే విధంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం 2 వేల మొక్కలను కళాశాల ఆవరణలో నాటాలని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈనెల 26న జిల్లా వ్యాప్తంగా 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు 50 బాల వికాస కేంద్రాలను పలు చోట్ల ఏర్పాటు చేశామని, పామర్రులో 51వ కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పూర్ణచంద్రరరావు, మోహన్‌రావు, జగన్నిహారి, పెదపూడి సుబ్రమణ్యం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సేవా సమితి అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్‌రావు

500 మందికి వైద్య పరీక్షలు

యలమర్రు(పెదపారుపూడి): గ్రామీణ ప్రాంతంలో అమరావతి సేవా సమితి చేస్తున్న వైద్య సేవలు అభినందనీయమని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. మండలంలోని యలమర్రులో ఆదివారం అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేవా సంస్థ ద్వారా గ్రామంలో వైద్యం, విద్య అభివృద్ధికి చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. మణిపాల్ వైద్యులు గుండె, క్యాన్సర్, ఆర్థోపెడిక్‌కు సంబంధించి 500 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అమరావతి సేవా సంస్థ నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు, సూరపనేని సత్యనారాయణ మాట్లాడారు.

వెండి బిందె సమర్పణ



మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి గుంటూరు జిల్లా వాస్తవ్యులు తాడికొండ ఫణికుమార్ శర్మ 740 గ్రాముల బరువుగల వెండి బిందెను ఆదివారం బహూకరించారు. శర్మ ఉదయం స్వామివారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వెండి బిందెను ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావుకు అందజేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మర్యాదలతో దాతను సత్కరించారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

పెనమలూరు: పెనమలూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న దాదాపు 60 మంది రౌడీషీటర్లను పోలీస్‌స్టేషన్‌కు పోలీసులు పిలిచారు. రౌడీషీటర్ల రోజువారీ చర్యల వివరాలు పోలీసులు తెలుసుకున్నారు. క్రమశిక్షణతో మెలగాలని ఇన్‌చార్జ్ సీఐ వాసంశెట్టి శ్రీనివాసరావు సూచించారు. ఇటీవల కొందరు రౌడీషీటర్లు శాంతిభద్రతలకు భంగం కలిగే విధంగా ప్రవర్తిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అటువంటి రౌడీషీటర్లను నగర బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు ఎస్సీ కమిషన్ అభినందన



గుడివాడరూరల్: గుడివాడ మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్‌గా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన మట్టా నాగమణి విక్టర్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు జాన్‌విక్టర్ దంపతులను ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ అభినందించారు. మండలంలోని లింగవరం గ్రామంలో ఆదివారం సాయంత్రం మట్టా నాగమణి విక్టర్ దంపతులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పదవులు ఎస్సీయేతరులకు కట్టబెట్టారన్నారు. ఆ చరిత్ర తిరగరాస్తూ ప్రస్తుత ప్రభుత్వం గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించిందన్నారు. అనంతరం నాగమణి, విక్టర్ దంపతులను ఘనంగా మారుమూడి సత్కరించారు. రైతుల సంక్షేమానికి కృషి చేసి మంచి పేరుతెచ్చుకోవాలని సూచించారు.

జల్లెడ పట్టి మరీ లబ్ధిదారుల గుర్తింపు

- మంత్రి జోగి రమేష్
- రామానుజవత్తర్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి జోగి రమేష్



సంక్షేమ పథకాలు వివరించి బ్రోచర్ అందజేస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ జల్లెడ పట్టి మరీ గుర్తించి కులాలు, మతాలు, వర్గాలు, పార్టీలు చూడకుండా సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చుతున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆదివారం గూడూరు మండలం కంకటావ సచివాలయం పరిధిలోని రామానుజవత్తర్లపల్లిలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ రూపకల్పన చేసి వలంటీర్ల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చేరుతున్నాయా లేదా అని తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒకవేళ అన్ని అర్హతలు ఉండి పథకాలు అందకుంటే వారికి కూడా లబ్ధి చేకూర్చాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచన అన్నారు. గ్రామాల్లో పర్యటిస్తున్నప్పుడు ప్రజలు ఆదరిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల సంతృప్తి వ్యక్తం చేయడం ఎంతో సంతోషం కలిగిస్తోందన్నారు. తమకు మేలు చేస్తున్న ప్రభుత్వం పట్ల ప్రజలు చూపిస్తున్న కృతజ్ఞతా భావం ఎంతో ఆశ్చర్యచకితులను చేస్తోందని చెప్పారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న జగనన్న పట్ల ప్రజలు అపారమైన విశ్వాసం వ్యక్తం చేస్తున్నారన్నారు. మా కోసం ఇంతకంటే గొప్పగా ఆలోచన చేసే ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని ప్రజలు ముక్తకంఠంతో చెప్పడం నిజంగా ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. నేను ఉన్నాను..నేను విన్నాను.. అనే మాటలు నిజం చేస్తూ ఇచ్చిన హామీలు అమలు చేయడం, వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందడానికి ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేకుండా వలంటీర్లే పనులు చేసి పెట్టడంపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోందన్నారు.

ఏమైనా సమస్యలున్నాయా...

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన మంత్రి జోగి రమేష్ ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, ప్రాధాన్యతా క్రమంలో వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, సర్పంచి రాజులపాటి రేణుకాదేవి, పీఏసీఎస్ చైర్మన్ మట్టా గుర్నాథం, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, కేడీసీసీబీ డైరెక్టర్ తలుపుల వెంకట కృష్ణారావు, ఏపీఎస్ఎఫ్‌సీ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్ణం మహాలక్ష్మయ్య నాయుడు, మోటేపల్లి రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైయినేజీ పనులు వేగవంతం

అధికారులకు ఎమ్మెల్యే పార్థసారథి ఆదేశం



కానూరు సనత్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: సనత్‌నగర్‌లో నిర్మాణం చేస్తున్న డ్రెయినేజీ పనులు వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు సనత్‌నగర్‌లో రూ.50 లక్షలతో ప్రధాన డ్రెయినేజీ నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభించారు. అయితే వర్షం కురవడంతో డ్రెయినేజీ నీరు సనత్‌నగర్ నుంచి తులసీనగర్ వద్దకు వచ్చి నిలిచిపోయాయి. ఆదివారం ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి సనత్‌నగర్‌కు వచ్చి పరిశీలించారు. గత ప్రభుత్వ పాలనలో సనత్‌నగర్ అభివృద్ధిపై పూర్తిగా నిర్లక్ష్యం చూపారని, ఈ కారణంగా సనత్‌నగర్‌లో కనీస వసతులు లేకుండా ఉన్నాయన్నారు. తమ హయాంలో అనేక అంతర్గత రోడ్లను నిర్మించామన్నారు. ప్రధాన డ్రెయినేజీ నిర్మాణం చేసి సనత్‌నగర్‌లో శాశ్వతంగా మురుగునీరు సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. డ్రెయినేజీ నిర్మాణం చేస్తున్న సమయంలో వర్షం కురవటంతో పనులకు ఆటంకం కలిగిందని తెలిపారు. డ్రెయినేజీ నిర్మాణం పనులు వేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. వైఎస్సార్ సీపీ నేతలు చాంద్‌బాషా, అబ్దుల్ రెహమాన్, పఠాన్ అహ్మద్, అజీజుల్లా, సిద్ధిక్ పాల్గొన్నారు.

ముందస్తు భద్రత చర్యలు

గన్నవరం: స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణం కేసులో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు కోర్టు రిమాండ్ విధించిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు భద్రత చర్యలు చేపట్టారు. టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగుతారనే సమాచారం మేరకు జాతీయ రహదారిపై పలు కూడళ్లలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక గాంధీచౌక్, సినిమా హాల్ సెంటర్, బస్టాండ్ వద్ద పోలీసులను భారీగా మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.

ఘనంగా లక్ష కుంకుమార్చన

పామర్రు: శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో స్థానిక విజయవాడ రోడ్డులోని బుచ్చిమ్మతల్లి ఆశ్రమంలోని రామలింగేశ్వరస్వామి సమేత పర్వత వర్ధనీ దేవి ఆలయంలో అమ్మవారికి లక్ష కుంకుమ పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని పంచామృతాలతో, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పసుపు కుంకుమలతో స్నపన కార్యక్రమాలను చేశారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 20 మంది రుత్వికులచే అమ్మవారికి లక్ష కుంకుమ పూజ చేశారు. కొమ్ముకూరు కనక సుందరశర్మ, కొమ్ముకూరు కార్తీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

మాజీ సైనికులకు ఉచిత దంత వైద్య సేవలు

మచిలీపట్నంటౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న ఎక్స్ సర్వీస్‌మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్ స్కీం ద్వారా మాజీ సైనికులు దంత వైద్య సేవలను ఉచితంగా పొందవచ్చునని విజయవాడ ఈసీహెచ్ఎస్ పాలీక్లినిక్ ఇన్‌చార్జి మాజీ కల్నల్ ఎస్ రావు అన్నారు. ఆదివారం స్థానిక జిల్లా కోర్టు సెంటర్‌లోని అన్నపూర్ణ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మాజీ సైనికులకు ఈసీహెచ్ఎస్ పథకం ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తోందన్నారు. మచిలీపట్నంలోని అన్నపూర్ణ ఇంటర్నేషనల్ డెంటల్ హాస్పటల్‌కు ఈసీహెచ్ఎస్ న్యూ ఢిల్లీ వారు ఉచిత వైద్య సేవలకు అనుమతులు ఇచ్చారన్నారు. అందువల్ల మాజీ సైనికులు ఈ ఆస్పత్రిలో ఈ పథకం ద్వారా ఉచిత దంత వైద్యసేవలు పొందాలని చెప్పారు. హాస్పటల్ డైరెక్టర్ రంగనాథ్, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు వసంతరావు, పెడన మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సలాం, మాజీ సైనికులు పాల్గొన్నారు.

మట్టి ఖర్చులకు ఆర్థిక సాయం

పెడన: స్థానిక రామలక్ష్మీ కాలనీకి చెందిన మెట్ల రామయ్య అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఆ కుటుంబానికి సహాయ ఫౌండేషన్ రూ.5 వేలు మట్టి ఖర్చుల కింద ఆదివారం అందజేసింది. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, సభ్యులు అలుగురి అజయ్, గుడివాడ సాయి పాల్గొన్నారు.